

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | గురువారం | నవంబర్ 2, 2023 | www.navatelangana.com



పార్టీలు, అభ్యర్థులు ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- రాజకీయ పార్టీలు, అభ్యర్థులతో సమావేశం

2లో...



ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అవగాహన

2లో...

బరిలో కాంగ్రెస్ రెబల్స్..!

- ఆదిలాబాద్ బరిలో సంజీవరెడ్డి, ఆసిఫాబాద్‌లో సరస్వతి
- పోటీలో ఉండాలని మెజార్టీ కార్యకర్తల పట్టు
- బోథ్‌లో అసమ్మతివాదులకు అధిష్టానం ఫోన్
- హస్తం పార్టీలో కలవరం రేపుతున్న పరిణామాలు


ఇటీవల ఆదిలాబాద్‌లో సమావేశమైన అసమ్మతి నాయకులు



కాంగ్రెస్‌లో టికెట్లు దక్కని ఆశావహులు రెబల్ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. తొలి నుంచి పార్టీలో ఉంటూ వివిధ కార్యక్రమాలు చేపట్టి..చివరకు టికెట్ దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. అధిష్టానం తీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలు, అనుచరులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. ఇందులో కొందరు కార్యకర్తలు మాత్రం పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉండాలని పేర్కొనగా.. మెజార్టీ కార్యకర్తలు మాత్రం పోటీలో ఉండటమే ఉత్తమమని స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో కార్యకర్తల కోరిక మేరకు ఎన్నికల బరిలో ఉండేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్‌లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవరెడ్డి, ఆసిఫాబాద్‌లో మర్సుకోల సరస్వతి ఎన్నికల బరిలో నిలించేందుకు రంగం సిద్ధం చేసుకోగా.. బోథ్‌లోనూ ఇదే తరహా భావించినా ఆ పార్టీ అగ్రనాయకుల నుంచి ఫోన్ రావడంతో కొంత వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్
ప్రాంతీయ ప్రతినిధి

వివరాలు..2లో...

కోనప్ప కోరిక నెరవేరేనా..?

- వరుసగా మూడోసారి విజయం కోసం కృషి
- సిర్పూర్(టి)లో ఊపందుకున్న బీఆర్ఎస్ ప్రచారం

సిర్పూర్(టి)లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నియోజకవర్గంలో ప్రస్తుతానికి నాలుగు పార్టీల ప్రచారం జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్ నుండి ప్రస్తుత ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీజేపీ నుండి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీష్‌బాబు, బీఎస్పీ నుండి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ నుండి రావి శ్రీనివాస్‌లు పోటీలో ఉన్న విషయం తెలిసిందే.

వివరాలు..2లో...



నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు (ఫైల్)





రెండు లేగ దూడలపై పులి దాడి

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలం తాంసి(కె) గ్రామ శివారు అటవీ ప్రాంతంలో బుధవారం రెండు లేగ దూడలపై పులి దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. పెన్‌గంగ నదీ పరివాహక ప్రాంతంలోని తాంసి(కె) గ్రామ అటవీ ప్రాంతంలో పెద్ద పులి అలజడి మళ్లీ మొదలైంది. ప్రతి సంవత్సరం ఇదే నెలలో పెద్ద పులులు మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అటవీ ప్రాంతం నుండి ఈ ప్రాంతానికి వస్తుంటాయి. వారం లోజుల క్రితం పులి పిప్పల్‌కోటి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో ఆవుల మందపై దాడి చేసింది. ఓ ఆవు మృత్యువాత పడింది. తాజాగా బుధవారం తాంసి(కె) శివారు అటవీ ప్రాంతంలో పులి లేగ దూడలపై దాడి చేయడంతో ఆ ప్రాంత వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజూ మాదిరిగానే పశువుల కాపరి ఆవుల మందను సమీప అటవీ ప్రాంతానికి మేత కోసం తీసుకెళ్లాడు. మేత మేస్తున్న సమయంలో పెద్ద పులి గండ్రిస్తూ మందపై దాడి చేసింది. దాడిలో గ్రామానికి చెందిన

మిగతా..2లో...

నేడు నిర్మల్‌కు సీఎం కేసీఆర్

ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయండి : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి ప్రచార జోరును మరింత పెంచనుంది. ఇప్పటికే ప్రచార పర్వంలో ముందున్న బీఆర్ఎస్, పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్తేజం నింపడమే లక్ష్యంగా ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. ఎన్నికల ప్రచార బహిరంగ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు దిగ్విజయం చేయాలన్న సంకల్పంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్ సమీప గ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆశీర్వాద సభకు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కుటుంబ సభ్యులతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసేలా చూడాలని పట్టణ అధ్యక్షులు, మండల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు.

గులాబీమయమైన నిర్మల్

సీఎం కేసీఆర్ ఎన్నికల సభకు నిర్మల్ ప్రాంతం గులాబీమయమైంది. సీఎం రాక కోసం గులాబీ జెండాలతో స్వాగత బ్యానర్లను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో హెలీపాడ్ ఏర్పాటు చేశారు. సభకు వాహనాలతో వచ్చే నాయకులు, ప్రజలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పక్కనే పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు నిర్మల్‌ను గులాబీమయం చేశాయి.



కోనప్ప కోరిక నెరవేరేనా..?

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్(టి) నియోజకవర్గం నుండి వరుసగా మూడోసారి గెలిచేందుకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అహర్నిశలు శ్రమిస్తున్నారు. 1952లో ఈ నియోజకవర్గం ఏర్పడగా 2018 అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు రెండు పర్యాయాల కంటే ఎక్కువ పర్యాయాలు గెలిచిన వారు లేరు. ఒక్క కోనేరు కోనప్పనే 2018లో ఎమ్మెల్యేగా గెలిచి మూడోసారి విజయం సాధించారు. ఆయన 2004లో కాంగ్రెస్ పార్టీ నుండి మొదటిసారి గెలుపొందగా, 2014లో బీఎస్పీ నుండి, 2018లో బీఆర్ఎస్ నుండి విజయం సాధించారు. 2014, 2018లో వరుసగా రెండు సార్లు గెలుపొందిన ఈయన ప్రస్తుత ఎన్నికలలో కూడా విజయం సాధించి హ్యాట్రిక్ సాధించేందుకు కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఒక మున్సిపాలిటీ, ఏడు మండలాలలో ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

ప్రచారంలో ఇవే ప్రధానాంశాలు

బీఆర్ఎస్ ప్రచారంలో ముఖ్యంగా రాష్ట్ర పథకాలే ప్రాధాన్యతగా ఉన్నాయి. ఇందులో కూడా ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇచ్చే పెన్షన్‌లను బీఆర్ఎస్ నాయకులు ముందుకు తీసుకెళ్తున్నారు. నియోజకవర్గంలో వేలాది మందికి ఈ పెన్షన్‌లు అందుతుండడంతో వారిని కలుస్తూ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. దళితబంధు, రైతుబంధు, రైతు బీమా, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ప్రజలకు ఎలా ఉపయోగపడుతున్నాయో వివరిస్తూ లబ్దిదారులను కలుస్తూ ప్రచారం చేపడుతున్నారు. వరుసగా మూడో సారి ఎమ్మెల్యేగా కోనప్ప గెలిచి నియోజకవర్గను చరిత్రను తిరగరాస్తారా అని నియోజకవర్గంలో చర్చ కొనసాగుతోంది.

బరిలో కాంగ్రెస్ రెబల్స్..!

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఈ సారి ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి రావాలని భావిస్తోంది. ఇందులో భాగంగా పోటీలో ఉండే అభ్యర్థులను జాబితాలను రెండు విడతల్లో విడుదల చేసింది. తొలి విడత జాబితా విడుదల సమయంలో ఎలాంటి అసమ్మతి స్వరాలు వినిపించకపోగా.. రెండో విడతలో మాత్రం ఒక్కసారిగా పరిస్థితులు హస్త వ్యస్తంగా మారుతున్నాయి. అనేక ఏండ్లుగా పార్టీలో ఉంటూ టికెట్లు ఆశించి భంగపడిన ఆశావహులు ఒక్కసారిగా పార్టీ అధిష్టానం తీరుపై భగ్గుమంటున్నారు. తమకు గెలిచేందుకు అవసరమైన ప్రజాబలం ఉందని ఎన్నికల్లో పోటీ చేయడమే ఉత్తమమని భావిస్తున్నారు. ఇందులో ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో కార్యకర్తలు, వారి అనుచరులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయం తీసుకున్నారు. ఇందులో మెజార్టీ కార్యకర్తలు పోటీ చేయడమే మేలని అభిప్రాయపడినట్లు తెలిసింది. మరోపక్క పోటీ చేయడం ద్వారా కాంగ్రెస్ ఓటుబ్యాంకు చీలిపోయే అవకాశం ఉందని మరికొందరు కార్యకర్తలు నచ్చజెప్పే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. కానీ ఆశావహులు మాత్రం బరిలో ఉండేందుకే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం.

బరిలో ఉండేందుకే మొగ్గు..!

ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఆ పార్టీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్‌తో పాటు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ సంజీవరెడ్డి టికెట్లు ఆశించారు. పార్టీ ఆదేశాల ప్రకారం వివిధ కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. ఇదే తరుణంలో ఏడాది క్రితం కొత్తగా బీజేపీలో చేరిన ఎన్ఆర్ఐ కంది శ్రీనివాస్‌రెడ్డి అనతికాలంలోనే ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి హస్తం పార్టీలో చేరారు. కంది శ్రీనివాస్‌రెడ్డి సైతం కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్న సమయంలోనే మిగితా ముగ్గురు నాయకులు ఒక్కటయ్యారు. తమ ముగ్గురిలో ఎవరికి టికెట్ వచ్చినా కలిసి పనిచేస్తామని.. కొత్తగా పార్టీలో చేరిన కందికి టికెట్ ఇస్తే మాత్రం కలిసి పనిచేసే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ అధిష్టానం మాత్రం శ్రీనివాస్‌రెడ్డికే టికెట్ ఖరారు చేసింది. దీంతో అసంతృప్తికి గురైన ఆశావహులు ముగ్గురిలో ఒకరు రెబెల్‌గా ఉండాలని నిర్ణయించారు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ సంజీవరెడ్డిని బరిలో దింపేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆయన కూడా పోటీలో ఉండేందుకు సుముఖంగా ఉన్నట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. మరోపక్క ఆసిఫాబాద్ నియోజకవర్గంలోనూ ఇదే తరహా పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ పార్టీలో తొలి నుంచి ఉంటూ వివిధ కార్యక్రమాలు చేపట్టిన మర్సుకోల సరస్వతి టికెట్ ఆశించారు. ఈమెతో పాటు డా.గణేష్‌రాథోడ్‌లు సైతం నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలు చేపడుతూ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నం చేశారు. ఓ దశలో వీరిద్దరిలో ఒకరికి టికెట్ వస్తుందని అందరూ భావించారు. కానీ కొన్ని నెలల క్రితం ప్రభుత్వ ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొని కాంగ్రెస్‌లో చేరిన ఆజ్మీరా శ్యాంనాయక్‌కు పార్టీ టికెట్ కేటాయించింది. దీంతో అసంతృప్తికి గురైన ఇద్దరు నాయకులు ఒక్కటై జిల్లా కేంద్రంలో నిరసన తెలుపడం చర్చనీయాంశమైంది. మర్సుకోల సరస్వతి మాత్రం ఎన్నికల బరిలో ఉండేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇక బోథ్‌లోనూ ఆడె గజేందర్, డా.నరేష్‌జాదవ్, పార్వతిబాయి, కొమురం కోటేష్ తదితరులు టికెట్ ఆశించారు. వీరితో పాటు డా.వన్నెల అశోక్ సైతం నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. పార్టీ అధిష్టానం వన్నెల అశోక్ పేరును ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో అసంతృప్తికి గురైన ఆశావహులు అందరూ ఒక్కటై ఆయన టికెట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇచ్చోడలో రెండు రోజుల క్రితం ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఒకరు రెబెల్‌గా పోటీలో ఉండేందుకు సిద్ధమయ్యారు. దీంతో పలువురు నాయకులకు అధిష్టానం పెద్దల నుంచి ఫోన్లు వచ్చినట్లు తెలిసింది. ఈ అంశంపై మాట్లాడుదామని చెప్పినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో కొంత వేచిచూసే ధోరణి అవలంభించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మరోపక్క సిర్పూర్, ముధోల్, మంచిర్యాల, నిర్మల్, బెల్లంపల్లి, ఖానాపూర్ నియోజకవర్గాల్లో మాత్రం అసమ్మతి పర్వం అంతగా కనిపించడం లేదు.

ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి : ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారతీయ పౌరులుగా ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, మావోయిస్టులకు ఎవరూ భయపడకూడదని ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. తిర్యాణి మండలం గోపెర గ్రామపంచాయతీలోని బుజ్జిగూడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ మావోయిస్టులకు భయపడకుండా నిర్భయంగా ఓటు వేయాలన్నారు. అందరికీ పోలీసు బలగాలు తోడుగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ప్రజాస్వామ్యబద్ధంగా వినియోగించుకొని మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో తమ పాత్ర పోషించాలన్నారు. యువత, ప్రజలు మావోయిస్టుల ప్రలోభాలకు లోను కావద్దని, వారికి సహకరించవద్దని తెలిపారు. అపరిచిత వ్యక్తుల మాయమాటలు నమ్మవద్దని, పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి, సహకరిస్తారని తెలిపారు. అపరిచిత వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ ఎం.వెంకటరమణ, సీఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ విజయ్ రాఘవన్, ఎస్ఐ రమేష్, సీఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

బోథ్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు భారతీయ జనతా పార్టీ(బీజేపీ)లో చేరారు. బుధవారం హైదరాబాదులో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, పార్టీ చేరికల కమిటీ ఛైర్మెన్ ఈటెల రాజేందర్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్ నుంచి రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన ఆయనకు తాజాగా జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ టికెట్ కేటాయించలేదు. ఆయన స్థానంలో నేరడిగొండ జడ్పీటీసీ అనిల్‌జాదవ్‌కు టికెట్ ఖరారు చేశారు. దీంతో అసంతృప్తికి గురైన బాపురావు కొన్ని రోజుల పాటు సైలెంట్ ఉండి..ఇటీవల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. టికెట్ కేటాయించాలని కోరారు. ఆ పార్టీ రెండో జాబితా వెల్లడి రోజున టికెట్ వస్తుందని చివరి వరకు ఆశతో ఎదురుచూశారు. కానీ కాంగ్రెస్ సైతం టికెట్ కేటాయించలేదు. దీంతో తాజాగా బీజేపీలో చేరిన బాపురావుకు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇస్తామని హామీనిచ్చినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలి

రాజకీయ పార్టీలు, అభ్యర్థుల సమావేశంలో మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-ఆదిలాబాద్

శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు సజావుగా సాగేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతిలాల్, డిసిపి. సుధీర్ రామ్నాథ్ కేకన్, మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాములుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కలిసి ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, ఖర్చులు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కొరకు జిల్లాలో చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల లోపు నామినేషన్ దాఖలు అభ్యర్థితో కలిపి 5గురికి అనుమతి ఉంటుందని, మొత్తం 3 వాహనాలను అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఒక్క అభ్యర్థి 4 సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చుని, అత్యధికంగా 2 ప్రాంతాలలో పోటీలో పాల్గొనవచ్చుని తెలిపారు. నామినేషన్లను ఉపసంహరించుకునే అభ్యర్థులు ఈ నెల 15న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరించుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా సభలు, సమావేశాలకు వినియోగించే సామాగ్రి, ప్రచారం కొరకు ఉపయోగించే కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్స్, స్పీకర్లు, ప్రకటనలు, సోషల్ మీడియాతో కలిపి ఇతరత్రా అన్ని రకాల ప్రచార సాధనాలకు రేట్ చార్జ్ రూపొందించడం జరిగిందని, ఎన్నికల ఖర్చుల పరిశీలకులు ఈ రేట్ కార్ట్ ప్రకారం లెక్కించడం జరుగుతుందని తెలిపారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలపై ముద్రించే ఏజెన్సీ వివరాలు కచ్చితంగా ముద్రించాలని, లేని పక్షంలో ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఓటర్లు తమ ఓటు హక్కును ప్రభుత్వం జారీ చేసిన 12 రకాల గుర్తింపు కార్డుల ద్వారా ఉపయోగించుకోవచ్చుని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లయితే సి-విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చుని, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతి కొరకు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. దివ్యాంగులకు, 80 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు, ఎన్నికల విధులలో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 3శాసనసభ నియోజకవర్గాలకు జరగనున్న ఎన్నికలను అధికారులు సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలని తెలిపారు.

రెండు లేగ దూడలపై పులి దాడి

(మొదటి పేజీ తరువాయి)

రైతు మురళీ లేగ దూడలు తీవ్రంగా గాయపడ్డాయి. గమనించిన పశువుల కాపరి పరుగు తీశాడు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పెద్ద పులి అడుగులను పరిశీలించే పనిలో ఉన్నారు. పెద్ద పులి నుండి తమను రక్షించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

గంజాయి పట్టివేత

నవతెలంగాణ-తాండూర్

రేపల్లెవాడ ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఆసియా సిరామిక్స్ కంపెనీ సమీపంలో ఓ విద్యార్థి గంజాయి సేవిస్తుండగా పట్టుకొకున్నామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు. అతని వద్ద నుండి 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

అదుపుతప్పి ద్విచక్ర వాహనం బోల్తా

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన ఆకుల సంతోష్ పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో అదుపుతప్పి ద్విచక్ర వాహనం పైనుంచి పడిపోయాడు. అధిక రక్తస్రావం కావడంతో 108 వాహనంలో కాగజ్‌నగర్ ప్రయివేట్ హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. పరిస్థితి నిలకడగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

నవతెలంగాణ-ముధోల్

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. బుధవారం మండలంలోని తరోడా గ్రామ సమీపన ఎస్సై ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన పత్రాలు పరిశీలిస్తూ తనిఖీ చేసిన తరువాతనే వదిలిపెడుతున్నారు. ఎనిన్నకల కోడ్ ఉన్నందున ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు. ఎన్నికల నియమావళి ప్రకారం రూ. 50 వేల కంటే ఎక్కువ నదగు తీసుకెళ్తే ఆధారాలు చూపాలని, లేని పక్షంలో సీజ్ చేస్తామన్నారు. మద్యం, ఆధారాలు లేకుండా నగదును తీసుకెళ్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని స్వర్ణ గ్రామంలో కేంద్ర పోలీస్ బలగాలతో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లో ప్రజల్లో భరోసా కల్పించేందుకు ఈ మార్చ్ నిర్వహించినట్టు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేపై శిక్షణ

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్విజిలేటర్‌లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మైసాజీ మాట్లాడుతూ ఎంపికైన పాఠశాలలో అన్ని యాజమాన్యల ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. పిల్లల అభ్యాసన స్థాయి, కనీస సామర్థ్యంపై అంచనకు ఈ నెల3న పరీక్షపై అవగాహన సదస్సు నిర్వహించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్విజిలేటరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బాసర

మండల ఎస్టీయూ కార్యవర్గాన్ని బుధవారం జిల్లా అధ్యక్షుడు జుట్టు గజేందర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా రవీందర్, ప్రధాన కార్యదర్శిగా నరేందర్ రావు, ఆర్థిక కార్యదర్శి ఎం. సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులుగా బి.నరేష్, ఎస్.మమత, కార్యదర్శులుగా జి. శ్రీరాములు, ప్రవీణ్ కుమార్, జిల్లా కౌన్సిలర్‌గా ఎన్.రఘులను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ప్రకటించారు. మండల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరం కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపల్లి నాగభూషణ్, నాయకులు లక్ష్మణ్, టక్కర్ రమేష్, గంగారావు, రాజశేఖర చారి పాల్గొన్నారు.

దివ్యశ్రీ ఫౌండేషన్ సభ్యునికి సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

దివ్యశ్రీ ఫౌండేషన్ ఆసిఫాబాద్ మండల ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన రాజేష్ సింగరేణిలో ఉద్యోగం సాధించడాన్ని ఫౌండేషన్ ఛైర్మెన్ దారావత్ ప్రవీణ్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో ఫౌండేషన్ ఛైర్మెన్ ఆయనను శాలువాతో సన్మానించారు. సభ్యునిగా కొనసాగుతూ ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ఛైర్మెన్ అత్రం భీంరావ్, రెబ్బెన, జైనూర్, నార్నూర్, గాదిగూడ మండలాల ఇన్‌చార్జిలు పవార్ పితా నాయక్, సురేష్ మధు, చిన్ను పటేల్, జైతు పటేల్, యశ్వంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే రేఖ

నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల మండల కాంగ్రెస్ నాయకులు లోఖండే దేవ్‌రావ్ చిన్నమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖ శ్యాం నాయక్ హాజరైయ్యారు. ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు వారి సుఖదుఖల్లో అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు జాకీరుల్లా ఖాన్, ఎంపీటీసీ అబేదా ఖానం కరీం ఖాన్, శ్యామ్ సుందర్, ఆడే ధిగాంబర్, అహ్మద్ ఖాన్, కైలాష్ ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



సారంగాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-సారంగాపూర్

నియోజకవర్గ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ప్రజలు ఆధారించాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్ కోరారు. బుధవారం మండల కేంద్రంతో పాటు చించొలి, దని, జాం గ్రామాల్లో పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి పార్టీ అభ్యర్థి ఇంద్రకరణ్ రెడ్డిని గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలో గౌడ కులస్తులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన పథకాలను వివరించి రాబోయే ఎన్నికల్లో ఇంద్రకరణ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అనుముల భాస్కర్, కొండా మురళి గౌడ్, కందునూరి అశ్విన్ గౌడ్, బూర శ్రీనివాస్ గౌడ్, బట్టు బీమన్న, సమీర్ పాల్గొన్నారు.

కడెం : మండలంలో లింగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం గ్రామంలో తిరుగుతూ ఖానాపూర్ నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్‌ను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రకటించిన మేనిఫెస్టోతో పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల బాలవ్వ లచ్చన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు శివయ్య, ఉప సర్పంచ్ రంజిత్, నాయకులు మల్లారెడ్డి, మాదాస్ నాగేష్, కలకుంట్ల నరేష్, కసుల రాజేష్, దుమ్మ సురేష్ పాల్గొన్నారు.



కడెంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరి రావు

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ రూరల్ మండలం కౌట్ల(కె) గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఆయనకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ ప్రకటించిన ఆరు హామీల పథకాలను ఇంటింటికి వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నిర్మల్ నియోజకవర్గంలో గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సర్వేలు కూడా అదే స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరి రావు

ఎస్‌బీఐ వ్యక్తిగత ప్రమాద బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మండలంలోని రాంపూర్ గ్రామానికి చ ఎందిన అల్లకుంట శ్రీనివాస్ మరణించారు. ఎస్‌బీఐ బ్యాంక్ ప్రమాద బీమా పాలసీని నామినికి ఎంపీడీఓ అల్లాడి వనజ చేతుల మీదుగా బుధవారం అందించారు. నర్సాపూర్(జి) బ్రాంచ్‌లో మృతుడు రూ. 200తో రూ. 4 లక్షల ప్రమాద భీమాకు ప్రిమియం చెలించాడు. బుధవారం నామినీ మృతుడి భార్యా అల్లకుంట మౌనికకు రూ. 4లక్షల చెక్కును బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, క్యాషియర్ నార్వాడె అనిల్ కుమార్ బాలకృష్ణ, గురుజీ రాథోడ్ ఎంపీడీఓ చేతుల మీదుగా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది అనంత విశ్వేశరరావు, ఎస్‌బీఐ సిబ్బంది గంగాధర్ పాల్గొన్నారు.



ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

నవతెలంగాణ-సారంగాపూర్

స్వాతంత్ర సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో కలాం గుణం ఎడ్యూకేషన్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మండల అధ్యక్షులు సయ్యద్ నయిం, ప్రధాన కార్యదర్శి సయ్యద్ కబీర్, షేక్ అఖిల్ పాల్గొన్నారు.



పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను తక్షణమే ఆపాలి

- ప్రజలకు వైద్యం, నిత్యావసర సరుకులు అందించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. మంచిర్యాల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్, దాగం శ్రీకాంత్ మాట్లాడుతూ అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి పశ్చిమ దేశాల అండతో అక్టోబర్ 7 నుండి ఇజ్రాయిల్ పాలస్తీనాపై సాగిస్తున్న యుద్ధకాండను, అమానుష దాడులను తక్షణం ఆపాలన్నారు. గత 20 రోజులుగా ఇజ్రాయిల్, పాలస్తీనాపై గాజాను కేంద్రంగా చేసుకొని భీకర వైమానిక దాడులతో యుద్ధకాండను కొనసాగిస్తున్నదన్నారు. ఇజ్రాయిల్ అమానుష దాడుల్లో 2 వేల మందికి పైగా చిన్నారులతో సహా సుమారు 6 వేల మంది మృత్యువాతపడ్డారని పేర్కొన్నారు. 18 వేల మంది తీవ్రంగా గాయపడి, 10 లక్షల మంది శరణార్థులుగా మారారన్నారు. వేల సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయన్నారు. చిన్నారులు, క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు గాజా ఆస్పత్రులకు జనరేటర్లకు కావలసిన ఇంధనాన్ని కూడా సరఫరా కాకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఐ) సైతం గాజాకు మానవతా సహాయం అత్యవసరంగా పొందాల్సి ఉందని, అంతర్జాతీయ సమాజానికి చేసిన విజ్ఞప్తి తీవ్రతను వెల్లడిస్తున్నదన్నారు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాద వైఖరిని ప్రపంచ హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ కూడా తీవ్రంగా విమర్శించిందన్నారు. ఇప్పటికైనా ప్రపంచ వ్యాప్తంగా శాంతి కాముకులు కోరుతున్న విధంగా పాలస్తీనా పై ఇజ్రాయిల్ దాడులు ఆపకపోతే ఎదురయ్యే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితుల్లో బాధిత పాలస్తీనా ప్రజానీకానికి కార్మికవర్గం, విద్యార్థులు సంఘీభావం తెలుపాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు అభినవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీపీఏ ఆధ్వర్యంలో కళాజాతా

నవతెలంగాణ-తాండూర్

మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు డీఆర్డీఏ వారి ఆధ్వర్యంలో తాండూర్ మండలంలోని గజ్జల పల్లి రేచీని తాండూర్ గ్రామాలలో ఓటర్ అవగాహన కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటుతో మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. ఓటు యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ కళాకారులు తమ ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు లావుడియా రమేష్, బీర్పురి శ్రీనివాస్, కొప్పర్తి రవీందర్, మార్కాపురం రవి కుమార్, అల్లూరి సత్యనారాయణ, నాగలక్ష్మి సమీరా, బీఎల్ఓలు పావని, బాలభారతి, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

రూ.5.50 లక్షలు సీజ్



వాంకిడి : మండలకేంద్రంలోని టోల్‌ప్రాజా చెక్‌పోస్టు వద్ద బుధవారం సీఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టగా మహారాష్ట్రకు చెందిన సయ్యద్ సోయబ్ అనే వ్యక్తి కారులో రూ.5.50 లక్షలు పట్టుబడినట్టు సీఐ తెలిపారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును స్వాదీనం చేసుకొని సీజ్ చేసినట్టు, సీజ్ చేసిన నగదును ఎఫ్ఎస్‌టీ టీంకు అప్పటించినట్టు సీఐ పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి నిబంధనల మేరకు ప్రతి వ్యక్తి రూ.50 వేల కంటే ఎక్కువగా నగదు తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై పోశెట్టి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడ్వాయి గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మెనిఫెస్టోలోని అంశాలను ఓటర్లకు వివరిస్తూ, కరపత్రాలను పంపిణీ చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పను కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సంజీవ్, శ్రీనివాస్, రాజన్న, చంద్రమౌళి, కోఆప్షన్ సభ్యుడు సాజిద్, నాయకులు రాజన్న, శ్రీనివాస్, సదాశివ్, బండన్న పాల్గొన్నారు.

ఘనంగా కుమురంభీం వర్థంతి వారోత్సవాలు

నవతెలంగాన-కెరమెరి


కుమురంభీం విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

ఆదివాసీ పోరాట యోధుడు, అమరజీవి కుమురంభీం 83వ వర్థంతి వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని సాకడ చౌరస్తా వద్ద కుమురంభీం వర్థంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సాకడ గ్రామం నుంచి డప్పు వాయిద్యాలతో చౌరస్తా వరకు ర్యాలీగా తరలివచ్చారు. భీం విగ్రహం వద్ద ఉన్న జెండాకు ప్రత్యేక పూజలు చేసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనందరావు, సర్పంచ్ మడవి సుమిత్రాబాయి, గ్రామ పటేల్ పెందోర్ దంబిరావు, మాజీ సర్పంచ్ జలపతిరావు, నాయకులు పెందోర్ శ్రీనివాస్, తుకరాం, వినేశ్, సాగర్, లచ్చు, బిలాజీ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు జిల్లా విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆత్రం అంజలి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచి హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షణ కేంద్రానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.కష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థినులు క్రీడల్లో అభివృద్ధి చెందేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంజలి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. ఎంపికైన విద్యార్థినిని ఆమెకు శిక్షణ ఇచ్చిన శిక్షకుడు విద్యాసాగర్‌ను ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ వెళ్తున్న ఆమెకు అధికారులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డీటీడీఓ రమాదేవి, ఏటీడీఓ క్షేత్రయ్య, ఏసీఎంఓ పి.ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, క్రీడల అధికారి బండ మీనారెడ్డి, హ్యాండ్ బాల్ కోచ్ అరవింద్, కోకో కోచ్ తిరుమల్, క్రీడ పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బంబారాలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బంబారా గ్రామంలో టీకాల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో కూడా ఎలాంటి వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, ఏఎన్ఎం సునంద, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, ఆశా కార్యకర్త సరోజ పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకుడు కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-జన్నారం



మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు భక్తిని నాగన్న గౌడ్, కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం, బాదంపల్లి చింతలపల్లి గ్రామాలకు చెందిన తన40 అనుచరులతో కలిసి కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు ఆయన కాంగ్రెస్ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగన్న గౌడ్ మాట్లాడుతూ బీజేపీలో సముచిత స్థానం లేకపోవడం, మాజీ ఎంపీ జి.వివేక్ బీజేపీ, కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ మేనిఫెస్టో నచ్చి ఆ పార్టీలోకి. వెళ్లినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా వెడ్మా బొజ్జు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని పాత కొత్త నాయకులందరూ కలిసిమెలిసి గెలిపించాలన్నారు. ప్రతి ఇంటికి గడపగడపకు వెళ్లి, ప్రజలకు కాంగ్రెస్ మేనిఫెస్టోను తెలపాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, రాజశేఖర్, మచ్చ శంకరయ్య, ఫసీఉల్లా, కరుణాకర్ గంగన్న రాజన్న, రవి పాల్గొన్నారు.

వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్‌లో చేరడం శుభ పరిణామం

నవతెలంగాణ-జైపూర్

పెద్దపల్లి మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి తిరిగి కాంగ్రెస్‌లో చేరడం శుభ పరిణామమని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇంత కాలం బీజేపీలో కొనసాగిన వివేక్ వెంకటస్వామి బుధవారం రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ చేరిన మరుక్షణం మండల నాయకులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ వివేక్ వెంకటస్వామి చేరికతో చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమైందని అన్నారు. బడుగు బలహీణ వర్గాల పార్టీగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని, పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలు ప్రతి ఇంటికి చేరవేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వివేక్ వెంకటస్వామికి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలుకుతున్నామని, నియోజకవర్గంలో వివేక్ వెంకటస్వామితో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణా ఇచ్చిన సోనియా గాంధీకి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి కానుకగా రాష్ట్ర నాయకత్వం అందించబోతుందని పేర్కొన్నారు. ఈ సంధర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుంగపిండి సాయికుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలి

ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

శాసనసభ ఎన్నికలకు సంబంధించి 30న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లచే నివృత్తి చేసుకోవాలన్నారు. ఎలక్షన్ కమిషన్ ఎన్నికల విధులకు సంబంధించిన నియమనిబంధనలతో కూడిన పూర్తి మెటీరియల్‌ను అందించడం జరిగిందని, బాధ్యతతో జాగ్రత్తగా విధులు నిర్వర్తిస్తే ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండదన్నారు. పీఓలు, ఏపీఓలకు అందిస్తున్న హ్యాండ్ బుక్, ఇతర సామాగ్రిని పరిశీలించి శిక్షణ సిబ్బందికి అందించాలని అధికారులను ఆదేశించారు. శిక్షణ తరగతులను శ్రద్ధగా విని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణమైన అవగాహనను ఏర్పర్చుకోవాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్‌ను ఉదయం ఆరు గంటలకు చేపట్టాలన్నారు. మాక్ పోల్ తరువాత తప్పనిసరిగా ఇన్ఫర్మేషన్ మొత్తం క్లియర్ చేసుకోవాలని, పోలింగ్ ప్రారంభానికి ముందే ఈవీఎంలను అన్ని విధాలుగా సరిచేసుకోవాలని సూచించారు. సిసి కెమెరాల నిఘాలో పోలింగ్ నిర్వహిస్తున్నందున ప్రతి అంశం రికార్డింగ్ అవుతుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేశ్వర్, మాస్టర్ ట్రైనర్లు, పీఓ, ఏపీఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మూడోసారి అధికారంలో రావడం ఖాయం



ఆదిలాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ ఛైర్మెన్ జోగు ప్రేమేందర్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

తెలంగాణ బీఆర్ఎస్ మూడవ సారి అధికారంలోకి రావడం ఖాయమని మున్సిపల్ ఛైర్మెన్ జోగు ప్రేమేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్ అన్నారు. బుధవారం 34వ వార్డు పరిధిలోని శాంతినగర్‌లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల తీరు, మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనతికాలంలోనే అన్ని రంగాల్లో గణనీయ పురోగతి సాధించామన్నారు. కాంగ్రెస్, బీజేపీల హయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పాటు పడుతున్న ఎమ్మెల్యే జోగురామన్నకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ము కృష్ణ, సయ్యద్ మోసిన్, నర్సాగౌడ్, ఇబ్బు పాల్గొన్నారు.

నార్నూర్ : సంక్షేమ పథకాలు అమలులో బీఅర్ఎస్‌తోనే సాధ్యమని వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేకర్, పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావ్ అన్నారు. బుదవారం తాడిహత్నూర్ గ్రామంలో పార్టీ తరుపున ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపంచాలని ప్రజలను కలుస్తూ అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఉర్వేత రుపదేవ్, ఏఎంసీ వైస్ ఛైర్మెన్ తొడసం నాగొరావ్, నాగల్‌కొండ ఎంపీటీసీ బదావత్ కళావతి ఉత్తమ్, నాయకులు సయ్యద్ ఖాసిం, కనక ప్రభాకర్, మడావి రూపదేవ్, విద్యారాణి, రాథోడ్ రమేష్ పాల్గొన్నారు.

ఇచ్చోడ :తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని బోథ్ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో పార్టీ కార్యాలయన్ని పార్టీ అభ్యర్థి అనిల్ జాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు 30 రోజులు గడపగడపు పార్టీ సంక్షేమ పథకాలు, చేసిన పనులు, అందించే పథకాలను ప్రతి ఓటరుకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతమ్ రెడ్డి, మండల కన్వీనర్ ఏనుగు కృష్ణా రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముండే పాండు రంగ్, ముక్రా(కె) ఎంపీటీసీ గాడ్గే సుభాష్, మాజీ మండల కన్వీనర్ మేరహజ్ అహ్మద్ పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలోని కుచులాపూర్‌లో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగింది. నియోజకవర్గ పార్టీ అభ్యర్థి అనిల్ జాదవ్ తరపున బుధవారం మండల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి అనిల్ జాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందే విధంగా సీఎం కేసీఆర్ రావు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, దేవరావు, మహేందర్, ప్రమోద్ పాల్గొన్నారు.

ఎంపీపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌పై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ జీవకార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిపై కత్తితో దాడి జరిగిందన్నారు. ఈ దాడి వెనుక కాంగ్రెస్ హస్తం ఉందని భావిస్తున్నామన్నారు. అధికారులు స్పందించి దాడి చేసిన వ్యక్తి, ప్రోత్సాహించిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, కోఆప్షన్ సభ్యులు రషీద్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, జిల్లా నాయకులు ప్రభాకర్, తిరుపతి, మహేందర్, షేక్ హైమద్, అన్సారీ, సతన్న, వాసు, గిరి ఉన్నారు.

ఇంద్రవెల్లి : దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌పై కాంగ్రెస్ గుండాలు కత్తితో దాడి చేయించారని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ కనక తుకారాం ఆరోపించారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో తమ పార్టీ గెలుస్తుందన్నారు. అది జీర్ణించుకొలేని కాంగ్రెస్ గుండాలు కొత్త ప్రభాకర్‌పై దాడి చేయించారని ఆరోపించారు. దీన్ని పార్టీ తరపున ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు మారుతి డోంగ్రే, సోఫియాన్, హన్మంతు, ఎంపీటీసీ మడావి భీమ్‌రావ్, పి.శోభా, అంజద్ పాల్గొన్నారు.



ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దే

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఇచ్చిన హామీలను నెరవెర్చిన ఘనత కాంగ్రెస్‌కు ఉందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మాబొజ్జు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని బొడ్డిగూడ, ఈశ్వర్ నగర్, కేస్లాగూడ, సమాక, కేస్లాపూర్, పిట్టబొంగరం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆరు గ్యారెంటి కార్డుల గురించి ప్రజలకు వివరిస్తు ఓట్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ.జహీర్, ముకాడే ఉత్తం పాల్గొన్నారు.

ఉట్నూర్ :రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం మండలంలోని సుద్దాగూడ గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు ఆయనకు డప్పు చప్పుళ్ళ మధ్య ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమావేశంలో వెడ్మ బొజ్జు మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని ఆకాంక్షించే ఏకైక పార్టీ కాంగ్రెస్సాని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలో వస్తే ఆరు గ్యారెంటీలతో పాటు మేనిఫెస్టోను పక్కాగా అమలు చేస్తామన్నారు. ప్రజలు బీఆర్ఎస్, బీజేపీ పాలనతో విసుగెత్తిపోయారని, రానున్న ఎన్నికల్లో చేతు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న చేరికలు

నవతెలంగాణ-అదిలాబాద్ అర్బన్

బీఆర్ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివాసి ఫర్దాన్ సమాజ్ ప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే జోగు రామన్న వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి స్వచ్ఛందంగా పార్టీలో చేరేందుకు యువత ఆసక్తి చూపుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. అంతకు ముందు అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ నాయకులు, సభ్యులతో పాటు శాంతినగర్, రిక్షాకాలనీ, బేల గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ ఆదివాసి పోరాట యోధుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆదివాసుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్ద పీట వేశారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు ఆదివాసుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్‌కు యువత మద్దతుగా నిలుస్తూ భారీ సంఖ్యలో పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతుండడమే అందుకు నిదర్శనమన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ల బూటకపు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, రానున్న ఎన్నికల్లో తమ పార్టీ గుర్తు ఓటు వేసి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్వ నగేష్, జంగు పటేల్, మాజీ మార్కెట్ ఛైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, సలీం పాషా, రామేశ్వర్, వెనుగంటి ప్రకాష్, సాజిదోద్దీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల ఛైర్మెన్ రాజీనామా

నవతెలంగాణ-సిరికొండ

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల ఛైర్మెన్ రాథోడ్ గంగాధర్ రాజీనామా చేశారు. బుదవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి తన రాజీనామ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు పార్టీలో పది సంవత్సరాలుగా కష్టపడి పని చేశామని, పార్టీ బోథ్ అభ్యర్థి కనీసం తమను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఫోన్ చేసిన కనీసం స్పందించడం లేదన్నారు. గెలవలకముందే తనవైఖరిని ఇలా ఉందని, గెలిస్తే పట్టించుకోరని ఆవేధన వ్యక్తం చేశారు. అభ్యర్థి వైఖరి నచ్చకనే తనతో పాటుగా 50 మంది కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేశామని స్పష్టం చేశారు. త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లింగన్న, ప్రభు, రాంకుమార్, గోపాల్, చిన్నయ్య, గణేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని చారులత విన్నపం

నవతెలంగాణ-ఉట్నూర్

ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ తనకే ఇవ్వాలని ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత కోరారు. బుధవారం పార్టీ జిల్లా పరిశీలకులు, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాష్ రాథోడ్‌కు వినతిపత్రం అందించారు. ఆమె నివాసనికి వచ్చిన పార్టీ జిల్లా పరిశీలకులు, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాష్ రాథోడ్‌కు తనకు జరిగిన అన్యాయం గురించి తెలియజేశారు. పార్టీ టికెట్ వెడ్మ బొజ్జుకు ఇచ్చారని దానికి ఆయన అనర్హుడని, నియోజకవర్గంలో లంబాడా జనాభా ఎక్కువగా ఉందని, పార్టీ టికెట్ లంబాడా సమాజాంలోని మహిళ రిజర్వేషన్ ఆధారంగా తనకు కేటాయిస్తే గెలుపు సాధ్యం అవుతుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధిష్టానంతో మాట్లాడి టికెట్టు తనకే వచ్చేల చూడాలని కోరారు.

పది ప్రపంచ రికార్డ్స్‌లో ఇతీక్షకు చోటు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఇంటర్నేషనల్ కర్ణాటిక్ మ్యాజిషన్స్ అండ్ డాన్సర్స్ అసోసియేషన్ గత ఏడాది డిసెంబర్ నెలలో నిర్వహించిన పది ప్రపంచ రికార్డ్స్‌లో పట్టణానికి చెందిన కొంకటి ఇతీక్ష పాల్గొని చోటు దక్కించుకుంది. లిటిల్ స్టార్ స్కూల్‌లో ప్రిన్సిపల్ కమలాకర్ రెడ్డి ఇతీక్షను అభినందించి మెమొంటో అందజేసి సత్కరించారు. జిల్లాలోని బాల కేంద్రానికి చెందిన 49 మంది బాలికలకు ఈ అవకాశం లభించగా అందులో ఇతీక్ష ఉఉండడం పట్ల పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

వాలీబాల్ కిట్టు అందజేత

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఇందాని గ్రామానికి చెందిన క్రీడాకారులకు బుధవారం వాలీబాల్ కిట్టును ఎస్సై సాగర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. యువత క్రీడల్లో రాణించడంతో పాటు ఉన్నత చదువులు చదువుకోవాలని, రానున్న రోజుల్లో చక్కగా చదువుకొని నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ క్రైమ్‌పై యువకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పోశెట్టి, గణేష్, మహేష్ పాల్గొన్నారు.



భూపట్టాలు మార్పిడి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది భూ కబ్జాదారులు పట్టాల మార్పిడి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాల్లో భూములున్న అమాయక ప్రజలను నమ్మించి రెవెన్యూ అధికారుల అండదండలతో వేలిముద్రలు తీసుకుని కొంతమంది భూ కబ్జాదారులు భూపట్టాలు మార్పిడి చేస్తున్నారని అన్నారు. రెవెన్యూ అధికారులు ఇటువంటి వారికి సహకరించడంతో అమాయక ప్రజలు మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం భూ కబ్జాదారుడు ఒక వ్యక్తిని మోసం చేసి ఆయన పేరు మీద ఉన్న పట్టాను మార్పిడి చేశారని అప్పటి నుంచి ఆ వ్యక్తి కార్యాలయం చుట్టు తిరిగిన పని కావట్లేదన్నారు. నాయకుల దృష్టికి కూడా సమస్య తీసుక వెళ్ళినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులతో కుమ్మక్కై



సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి బాధితుడికి న్యాయం చేయాలని అన్నారు. ఇటువంటివి జిల్లాలో అనేకం జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టింపు లేని తనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గెడం టీకనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, వడ్లూరి శ్రీకాంత్, జిల్లా నాయకులు దుర్గం రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-19 నెట్ బాల్ ఎంపిక పోటీలును జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడల ప్రధాన కార్యదర్శి బాబురావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్‌లు ఒక ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. సెలక్షన్స్‌కి వచ్చేవారు ఆధార్ జిరాక్స్, 4 పాస్ పోర్ట్ సైజు ఫొటోస్, ఎస్సెస్సీ మెమోతో ఉదయం 10 గంటలకు తెలంగాణ ఆదర్శ పాఠశాలలో హాజరు కాగలరని, మిగతా వివరాలకు వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బాబూరావు 9949300668 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మేరగూడలో బీఎస్‌పీ ప్రచారం



పెంచికలపేట్ : మండలంలోని మేరగూడ గ్రామంలో బీఎస్‌పీ మండల అధ్యక్షుడు దేవాజీ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఓటర్లకు బీఎస్‌పీ మెనిఫెస్టోను వివరిస్తూ ఓటర్లను బీఎస్‌పీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఎస్‌పీ నాయకులు బిట్టు శ్రీనివాస్, కుంపుటం గోపాల్, యాదవ్, దాదాజీ పాల్గొన్నారు.

హాజరు శాతం పెంచేందుకు అల్పాహారం

- జిల్లా విద్యాధికారి అశోక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాల విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ముఖ్యమంత్రి అల్పాహార కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. మండలంలోని చిర్రకుంట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అల్పాహార పతక తీరును పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం పూట ఆలస్యంగా రాకుండా తోడ్పడుతుందన్నారు. బుధవారం 65 పాఠశాలల్లో అల్పాహారాన్ని అందజేసినట్లు వివరించారు. త్వరలోనే జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభం కానున్నట్లు వివరించారు. అనంతరం పాఠశాల అచీవ్మెంట్ టెస్టులు పరిశీలించి మోడల్ టెస్టుల



నిర్వహణపై ఉపాధ్యాయుల పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల మూడో తేదీన నిర్వహించనున్న అచీవ్మెంట్ పరీక్షలు నిర్వహణ పకడ్బందీగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంక్లూజివ్ కోఆర్డినేటర్ కటకం మదుకర్, క్వాలిటీ కోఆర్డినేటర్ అభిద్ అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనరాజ్, సీసీఓ సోను పాల్గొన్నారు.

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి

- జిల్లా సమన్వయకర్త అధికారి పోలోజు బాలరాజు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో రాణించాలని, నేటి కంప్యూటర్ యుగంలో అనేక సదుపాయాలు ఉన్నాయని, యువత వీటిని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని జిల్లా క్రీడల సమన్వయ కర్త అధికారి పోలోజు బాలరాజు అన్నారు. బుధవారం హర్యానాలో సాఫ్ట్ బేస్‌బాల్‌లో విజయం సాధించిన విద్యార్థినిలను ఆయన ఘనంగా సన్మానించారు. హర్యానాలో గత నెల 27 నుంచి 29వ తేదీ వరకు ఎనిమిదో జాతీయస్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ క్రీడల్లో ఆసిఫాబాద్ జిల్లా జట్టుకు కాగజ్‌నగర్ గురుకుల పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినిలు శిల్పా, వనజ పాల్గొని రన్నరఫ్ ట్రోఫీని సాధించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా స్వాగతించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు ప్రభుత్వం విద్యార్థుల యొక్క నైపుణ్యాన్ని గుర్తించి వారు ఏ రంగంలో రాణిస్తున్నారో గమనించి అదేస్థాయిలో వారికి శిక్షణ ఇస్తుందని, విద్యార్థులు ఇలాంటి అవకాశాలను వినియోగించుకొని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలన్నారు. విద్యార్థులు పాఠశాలతో పాటు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థినిలను సన్మానించిన వారిలో ప్రిన్సిపల్ సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. తిర్యానీ మండలంలోని గుడిపేటలో ఆ మండల అధ్యక్షుడు కినుక జంగు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రత్యేక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డుకు పాలక వర్గాన్ని నియమించాలని అన్నారు. కార్మికులు అందరికి డబులు బెడ్ రూమ్ ఇవ్వాలని, ప్రమాద భీమా ఎక్స్ గ్రేషియో రూ.20 లక్షలు ఇవ్వాలని, కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు మోడీ, కేసీఆర్ ఊడిగం చేస్తున్నారని, కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సీఎంపీఎఫ్, కార్పొరేట్ వైద్య సదుపాయం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి సత్తయ్య, కోశాధికారి లింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగం మొగిలి గౌడ్, నాయకులు భీమ్ రావు, గట్టయ్య, రాజు, మారుతి పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడికి వీడ్కోలు



ఆదిలాబాద్ రూరల్ : మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డా. రాహుల్ గడపాలే పీజీ జనరల్ సర్జరీ విభాగంలో, డా.మిట్టపల్లి శ్రీకాంత్‌కు పీజీ విభాగంలో సీటు రావడంతో పీహెచ్‌సీలో వారిని సత్కరించారు. అనంతరం పీహెచ్‌సీకి నూతనంగా వచ్చిన డాక్టర్ సర్వ రాజుకు స్వాగతిస్తు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డా. దేవోల శ్రీనివాస్, డా. కస్తాల చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు వసంత, శ్యామల, బొమ్మెత సుభాష్, ఆడే, సురేష్, కొడప యశోధ, మర్సకోల లక్ష్మీ బాయి, స్టాఫ్‌నర్సులు గంగామణి, దృపథ, ల్యాబ్ టెక్నిషన్ మడావి శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంటులు ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
గురువారం నవంబర్, 02, 2023

కాంగ్రెస్ టికెట్ నేతకానికి కేటాయించాలి

నవతెలంగాణ-చెన్నూర్

చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్‌ను నేతకాని సామాజిక వర్గానికి కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర నేతకాని సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం ఎల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ నేతకాని బిడ్డ గోమాస శ్రీనివాస్‌కు ప్రకటించాలని, లేనియెడల వేరే వర్గానికి ఎవరికైనా టికెట్లను కేటాయిస్తే నేతకాని సంఘం కులస్తులు అందరం ఏకమై కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ హై కమాండ్ స్పందించి నేతకాని కులస్తులకే చెన్నూరు అసెంబ్లీ టికెట్ కేటాయించాలని నేతకాని మహార్ కులస్తుల సంఘం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో ఎస్కారి రాజమల్లు, ప్రభాకర్, నాగరాజు, అనూష, రాయమల్లు పాల్గొన్నారు.

మండలంలో బీజేపీ ఖాళీ

- మండల అధ్యక్షుని రాజీనామా

నవతెలంగాణ-భీమారం

మండలంలో బీజేపీ నుంచి రాజీనామలా పర్వం కొనసాగుతోంది. గత నాలుగు సంవత్సరాలుగా పార్టీని భల పరిచేందుకు కృషి చేసిన వారంత ఒక్కొక్కరిగా పార్టీని వీడీ ఇతర పార్టీలో చేరారు. గత కొద్ది కాలం క్రితం ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భరత్‌రెడ్డి వర్గంతో పార్టీనీ వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఐతే బుధవారం తాజాగా ఆ పార్టీ మండలాధ్యక్షడు వేల్పుల శ్రీనివాస్ కూడా పార్టీకీ రాజీనామ చేసినట్లు ప్రకటించారు. శ్రీనివాస్ ఎంతో కాలంగా గడ్డం వివేక్ వర్గీయుడు కావడంతో ఆయన బుధవారం రాహూల్ గాంది సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన వెంటే నేను అంటు బీజేపీకి రాజీనామ చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షడికి రాజీనామ లేఖ అందజేశారు. దీంతో మండలంలో బీజేపీ పూర్తిగా ఖాళీ అయ్యిందనే చెప్పవచ్చు. ఐతే మండలంలో గడ్డం వివేక్‌కు అభిమానులు అధిక సంఖ్యలోనే ఉండటంతో ఇతర పార్టీల నుంచి కూడా కాంగ్రెస్‌లో భారీగా చేరికలు కొనసాగుతాయని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్

రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీరాంపూర్ సీఐ రమేష్ బాబు సూచించారు. బుధవారం శ్రీరాంపూర్ ఎస్సై రాజేష్‌తో కలిసి ఏరియాలోని హిమ్మత్ నగర్ కాలనీ వాసులతో ఎన్నికలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలు ఉన్నందున రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి పార్టీ గురించి ఏలాంటి విభేదాలు తలెత్తకుండా ప్రచారం చేసుకోవాలని, ఏలాంటి అల్లర్లు జరిగిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతీ ఒక్కరూ ఎన్నికల నిభందనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంగిచిన వారిపై సివిల్‌యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని, ఎన్నికలకు సంబందించిన ర్యాలీలు, సభలు, వెహికల్ పెర్మిషన్‌లు, మైక్ పెర్మిషన్‌లకు సువిధా యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. అలాగే రూ.50 వేల కన్నా ఎక్కువ మొత్తంతో ప్రయాణం చేస్తే



తగిన ఆధారాలతో కూడిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరగడానికి పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

గెలుపు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్‌వీ విద్యార్థి విభాగం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుల మధుకర్ అన్నారు. బుధవారం మధుకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌వీ విద్యార్థి విభాగం ఆత్మీయ సమ్మేళనం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నడిపెల్లి విజిత్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే ఎమ్మెల్యేను మరోసారి గెలిపించుకోవడమే విద్యార్థి విభాగ నాయకుల లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ ఈ సంపెల్లి ప్రభాకర్, మంచిర్యాల పట్టణ ఉపాధ్యక్షులు చిప్పకుర్తి జగన్, బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ నాయకులు మహమ్మద్ సాజిద్, చోటు, నక్క తిరుపతి, బాద్షా అంజత్ ఖాన్, రావుల శ్రావణ్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



నవతెలంగాణ-జన్నారం

కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు దొమ్మటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వినియోగదారులకు హక్కులకు సంబందించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ 1986లో వినియోగదారుల హక్కుల చట్టం మన దేశంలో అమలులోకి వచ్చిందని అన్నారు. దీనిపై అవగాహన లేకుండా చాలామంది వినియోగదారులు నష్టపోతున్నారని అన్నారు. ముఖ్యంగా నిత్యావసర వస్తువులు, కల్తీ ఆహార పదార్థాలు, కల్తీ ఎరువులు, విద్యా సంస్థల్లో అధిక ఫీజులు, ఆసుపత్రుల్లో అధిక చార్జీలు, గ్యారెంటీ-వారంటీ, ఎలక్ట్రానిక్, గూడ్స్, ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్స్ తదితర వాటిలో అనేక రకాలుగా వినియోగదారులు మోసపోతున్నారని వివరించారు. వినియోగదారులు ఏ వస్తువైనా కొనుగోలు చేస్తే ఆ వస్తువు సేవకు నష్టం వాటిల్లినట్లయితే కన్స్యూమర్ కోర్టును సంప్రదించవచ్చునని సూచించారు. రాబోయే రోజుల్లో మంచిర్యాల జిల్లాలో అన్ని మండలాల్లో సీఆర్ఓ కమిటీలు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కన్వీనర్ లశెట్టి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లేడ నరేష్, ఉపాధ్యక్షుడు కోడి సృజన్, కార్యవర్గ సభ్యుడు రవి, నర్సయ్య, మహేష్, హరీష్, తిరుపతి, అనిల్, వినోద్ పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుడికి ఉద్యోగుల సాయం

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట గనిలో ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లో పని చేసిన సింగరేణి జనరల్ మజ్దూరు ఉద్యోగి దుంద్రు ఐలయ్య ఇటీవల అనారోగ్యలో మృతి చెందగా తోటి ఉద్యోగి కుటుంబానికి తమ వంతు సహాయంగా ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు రూ.80,000 సేకరించి, రూ.50 వేలు ఐలయ్య కూతురు పేరు మీద ఫిక్స్ చేసి ఫిక్స్ బాండ్తో పాటు రూ.30 వేల నగదును కుటుంబ సభ్యులకు గని మేనేజర్ అల్లావుద్దీన్ చేతుల మీదుగా అందించారు. తోటి ఉద్యోగికి సహాయం చేయాలనే బాధ్యతతో ఆర్థిక సహాయం చేసి తోటి ఇంజనీర్ డిపార్ట్మెంట్ ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫోర్మెన్ వొడ్నాల రాజన్న, పిట్ ఇంజనీర్ బాపు, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఉద్యోగులు పుప్పాల శ్రీనివాస్, కనుకుల తిరుపతి, సతీష్ యాదవ్, మల్లేశ్, నిఖిల్, రఘురాం, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించేందుకు సమాయత్తం కావాలి

నవతెలంగాణ-తాండూర్

మండలంలో నైపుణ్యతలేని కూలీలందరికీ వందరోజుల పని దినాలు కల్పించేందుకు ఉపాధి హామీ సిబ్బంది సమాయాతం కావాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం తాండూర్ మండలంలోని ఉపాధి హామీ సిబ్బందికి పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డుదారులందరికీ కూలీ లభించే విధంగా అంచనాలను తయారు చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పని స్థలాలను ఎంపిక చేసి అంచనాలను తయారు చేయాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో వచ్చే సంవత్సరానికి నర్సరీ ఏర్పాటుకు సన్నాహకాలు పూర్తిచేయాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన పోలింగ్‌స్టేషన్‌లో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని అనిఆదేశించారు. గ్రామపంచాయతీలలో ఎల్లప్పుడు పారిశుధ్య నిర్వహణ జరగాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీ100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో



పంచాయతీ అధికారి తాండూరు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-తాండూర్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు బెయిలు మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బెల్లంపల్లి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బెల్లంపల్లి రామా టాకీస్ చౌరస్తాలో ఆర్కే ఎంటర్‌ప్రైజెస్ చౌరస్తాలో కాంటా చౌరస్తాలో బెల్లంపల్లి టీఎన్‌టీయూసీ ఆఫీసు సెంటర్లలో నాయకులు కార్యకర్తలు మిఠాయిలు పంచుతూ పటాకులు పేల్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు టీ.మణిరాంసింగ్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గద్దల నారాయణ, జిల్లా అధ్యక్షుడు ఓ జీవరత్నం, పట్టణ ఉపాధ్యక్షుడు బొల్లు మల్లయ్య, కాసర్ల వెంకటేష్, ఎండీ హసన్ ఏ సదానందం, ఎస్ శ్రీకాంత్, కె.నారాయణ, భగవాన్ సింగ్, తాహెర్ ఖాన్, పెండ్యాల శ్రీనివాస్, శంకరయ్య పాల్గొన్నారు.

బాధిత కుంటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-భీమిని

మండలంలో అక్కపల్లి గ్రామంలో బుర్రి శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం వారి ఇంటికి ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. బుర్రి శంకర్ కుటుంబానికి అన్నివిదాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-భీమారం

ప్రస్తుత ఆధునిక యుగంలో అంతా స్మార్ట్ యుగం అయ్యిందని, దీనికి తోడు అదే స్థాయిలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ఎస్సై రాజవర్దన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నేడు జరుగుతున్న సైబర్ మోసాలు స్మార్ట్ ఫోన్‌తోనే ఇలాంటి మోసాలు జరుగున్నాయన్నారు. ఏదో ఒక గుర్తు తెలియని నెంబర్ నుంచి మీకు లోన్ కావాలా అంటు వచ్చే ఫోన్‌లతో అతి జాగ్రత్తగా ఉండాలన్నారు. అదేవిధంగా కొరియర్, లక్కీ డ్రాలో మీ నెంబర్ ఎంపికైందటు వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి ఫోన్స్ వచ్చినప్పుడు వారితో మీ వ్యక్తిగత సమాచారం పంచుకోకుండా ఉండాలన్నారు. అలాంటి అనుమానించదగ్గ ఫోన్‌లు వచ్చినప్పుడు వెంటనే సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకం

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్
- శిక్షణ కేంద్రం పరిశీలన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో విధులు కేటాయించబడిన అధికారులు తమ బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డా. రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో రెండు రోజులపాటు ఈవీఎం వివి ప్యాట్లపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం మొదటి రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సజావుగా సాగేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పిఓ డైరీ, హ్యాండ్ బుక్ పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణకు 597 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో ప్రతి అంశాన్ని వీడియోగ్రఫీ చేస్తామని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గానికి సంబంధించి కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ దీపక్ తివారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా సాగేందుకు విధులు కేటాయించబడిన అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పూర్తిగా తెలుసుకొని ఉండాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన పట్టణ నాయకుల, కార్యకర్త సమావేశంలో సక్కు మాట్లాడారు. సమయం ఎక్కవగా లేదని, కార్యకర్తలకు కేటాయించిన బూత్ స్థాయిలో కోవ లక్ష్మి ప్రచార కరపత్రాలు, వాల్ పోస్టర్లను అంటించడంతో పాటు పార్టీ మేనిఫెస్టోను బూత్ పరిధిలోని ప్రజలకు ఇస్తూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రచారం చేయాలన్నారు. కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేసి బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు వేటు వేయాలని ఓటర్లను అభ్యర్థించాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి కీలకమని బాధ్యతగా పని చేస్తేనే గెలుపు సాధ్యం అవుతుందన్నారు. కోవ లక్ష్మికి తనకు ఎలాంటి విభేదాలు లేవని, ఎవరికైన అలాంటి అపోహాలుంటే పక్కన పెట్టాలన్నారు. అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమం, అభివృద్ధితో ముందుకెళ్లి ప్రజలకు చెప్పాలన్నారు. కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు చేపట్టిన అభివృద్ధిని వివరించాలన్నారు. స్థానికంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటున్న కోవ లక్ష్మి గెలుపుకు ప్రతి కార్యకర్త కష్టపడాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిలువేరు వెంకటేశ్వర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు హైమద్, నాయకులు రాజేశ్వర్, జీవన్, అన్సార్, సాజీద్, అబ్దుల్లా, అమన్, చిలుకూరి రవి, శైలేందర్, కార్తీక్, ప్రసాద్ గౌడ్, రౌఫ్, నజీర్, ఖాలీద్, ఇర్ఫాన్, సత్తన్న, రమేష్, గిరి, నజీర్ పాల్గొన్నారు.

కన్నాలబస్తీలో గంజాయి పట్టివేత

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలోని కన్నాలబస్తి ఫ్లైఓవర్ సమీపంనకు వెళ్లగా అక్కడ గుమాస ప్రశాంత్, గంజాయి సేవిస్తుండగా పట్టుకొని అతని వద్ద నుంచి 150 గ్రాముల గంజాయి స్వాధీనపర్చుకున్నట్లు వన్ టౌన్ ఎస్సై బన్సీ లాల్ తెలిపారు. అతనిని విచారించగా అతను గత కొంత కాలంగా బాల్లార్ష నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి బెల్లంపల్లిలోని యువకులకు ఎక్కువ రేటుకు విక్రయించడమే గాక తాను కూడా గంజాయి సేవిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. వ్యక్తిపై బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

18 మందికి ఆపరేషన్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో గత శనివారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరంలో ఆపరేషన్లకు ఎంపికైన వారిని బుధవారం బెల్లంపల్లికి తరలించారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు మాట్లాడుతూ ఆపరేషన్లకు 18 మంది ఎంపిక కాగా, వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ సహకారంతో ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్లకు తరలిన వారికి భోజన సదుపాయం, రవాణా ఛార్జీలను డాక్టర్ శ్రీనివాస్ అందించారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ - కౌటాల

మండలంలోని కోయగూడెం, గురుడుపేట, కనికి గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావు ఆధ్వర్వంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి బీఆర్ఎస్ మెనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జెడ్పీటీసీ అనేష మధుకర్, ముత్తంపేట్ ఎంపీటీసీ సురేఖ రవి, నాయకులు రాచకొండ అశోక్ పాల్గొన్నారు.

బీఎస్పీకి రాజీనామాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బహుజన సమాజ్ పార్టీకి పలువురు బుధవారం రాజీనామాలు చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వైఖరి వల్లే తాము రాజీనామా చేస్తున్నట్లు వారు ప్రకటించారు. రాజీనామా చేసిన వారిలో జిల్లా ఇన్‌ఛార్జి ఆకుల సంతోష్ కుమార్, సీనియర్ నాయకులు వైరాగడె పోశం, ముదాస్సిర్ హుస్సేన్, మహ్మద్ సిరాజ్, భీంరావు, సుభాష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిర్పూరు నియోజకవర్గంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు కోసం రాష్ట్రవ్యాప్తంగా పార్టీని నాశనం చేశారని అన్నారు.